

ఉచిత కంటి వైద్య శిబిరం



ఉచిత కంటి శుక్ల శస్త్ర చికిత్సలు చేసుకున్న రోగులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపల్లె ఆధ్వర్యంలో 17 ఉచిత కంటిశుక్లం శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ నివేదిత, లయన్స్ క్లబ్ జడ్.సి.డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి తెలిపారు. సోమవారం విజయవంతంగా కంటి శుక్లం ఆపరేషన్లు పూర్తి చేసుకున్న వారికి మందులు అందజేసి, వారిని వారి ఇళ్లకు పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక లయన్స్ ఐ ఆసుపత్రిలో కంటిలో శుక్లం వున్న 17 మందిని గుర్తించి వారికి ఉచిత కంటిశుక్లం శస్త్ర చికిత్సలు చేశామన్నారు. అంధత్వాన్ని రూపు మాపే ఈ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ నిరంతర యజ్ఞంలా ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని పలువురు కంటిలో శుక్లం రావడం వల్ల అందత్వంతో ఇబ్బంది పడుతున్నారని, వారి కుటుంబాల్లో కంటి వెలుగులు అందించే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పిఆర్ఓ గౌతమ్ రెడ్డి, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీ!




- టెన్త్ ఫీజులో 20 శాతం పెంపు
- ఇంటర్, ఇంజినీరింగ్‌కు రూ.3 లక్షలు
- క్రమబద్ధీకరణ, చెల్లింపులపై నిఘా ఏదీ
- దిక్కుతోచని స్థితిలో తల్లిదండ్రులు

ఉమ్మడి జిల్లాలో ఫీజుల దోపిడీ కొనసాగుతోంది. ప్రతి ఏటా అకడమిక్‌ఇయర్ జూన్ నుంచి ప్రారంభమవుతున్న సంగతి తెలిసిందే. పిల్లల ఫీజులు, హాస్టల్ ఖర్చులను తలుచుకుని తల్లిదండ్రులు నిలువునా వణికిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం పథకాల అమలు కంటితుడుపుగా తలపిస్తున్నాయి. ఫీజురీయింబర్స్‌మెంట్ ఆలస్యమైతే విద్యాసంస్థల యాజమాన్యాలు ముందుగానే ఫీజులు చెల్లించాలనే పేరుతో హాల్‌టికెట్లు, ఉత్తీర్ణత సర్టిఫికెట్లు ఇవ్వని పరిస్థితి నెలకొంది. హాస్టల్ ఫీజులు చెల్లిస్తేనే భోజనాలనే వేధింపులకు గురిచేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు వసూలు చేస్తున్న ఫీజులకు, ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లింపులకు పొంతన లేకపోవడం గమనార్హం.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాలు తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఇటువంటి కరువు సీమను ప్రయివేటు విద్య నిలువు దోపిడీ చేస్తోంది. ప్రభుత్వం ప్రయివేటుకు ప్రజలను ఎరవేసి చోద్యం చూస్తోంది. ఉమ్మడి కడప జిల్లాల్లో 2,200 ప్రభుత్వ పాఠశాలలు, 950 ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 1,56,156 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. 950 ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో సుమారు 1.40 లక్షల మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రయివేటు, కార్పొరేట్ విద్య వ్యాపారంగా మారింది. ఫలితంగా లక్షలాది మంది తల్లిదండ్రుల దగ్గర నుంచి రూ.లక్షలాది ఫీజులను వసూలు చేస్తుండడం పరిపాటిగా మారింది. ఎల్‌కెజికి రూ.23 వేలకుపైగా చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. ఈ ఏడాది 10వ తరగతి విద్యార్థికి 20 శాతం చొప్పున ఫీజులు పెంచేయడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది రూ.55 వేలు ఉండగా, ఈ ఏడాది ఉన్నఫళంగా రూ.65 వేలకు పెంచారు. ఐదవ తరగతికి ప్రయివేటులో రూ.28 వేలు, కార్పొరేట్‌లు రూ.40 వేల నుంచి రూ.65 వేల వరకు వసూలు చేస్తున్నాయి. దీనికి అదనంగా పుస్తకాలు రూ.16 వేలు, యూనిఫామ్స్‌కు రూ.4 వేలు, యాప్‌లకు రూ.2 వేలు చొప్పున వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈలెక్కన 10వ తరగతి నాన్ ఎసి విద్యార్థికి రూ.77 వేల రూ.90 వేల వరకు చెల్లింపులు చేయాల్సిన దుస్థితి దాపురించింది. ఎసి విద్యార్థి సుమారు రూ.లక్ష వరకు చెల్లించుకోవాల్సి వస్తోంది. ఈలెక్కన ఇద్దరు పిల్లల ఫీజులను లెక్కిస్తే ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.రెండు లక్షల చొప్పున ముట్ట చెప్పాల్సి వస్తోంది. తల్లిదండ్రులిద్దరూ ఏడాది పొడవునా ఖర్చు చేసినా ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజులకు అదనపు అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, పర్యవేక్షణ లేకపోవడంతో తల్లిదండ్రులు పిల్లలను ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లకు పంపించాల్సి వస్తోంది. ప్రయివేటు విద్యా సంస్థల దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఇంటర్, డిగ్రీ, మేనేజ్‌మెంట్, ఫార్మా స్యూటికల్ చదువులు ఖరీదైన వ్యాపారంగా మారిపోయింది. నీట్, ఎంసెట్, జెఇఇ, జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు పెరిగిన పోటీ నేపథ్యం ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలకు కాసుల పంట పండుతోంది. కాంపిటీషన్ పరీక్షల్లో మెరుగైన ర్యాంకులు సాధిస్తేనే సీటు లభించే అవకాశం ఉంది. లేనిపక్షంలో యాజమాన్య కోటా కింద పెద్దఎత్తున లక్షలాది రూపాయలు ముట్ట చెప్పుకోవాలి. డేస్కాలర్స్‌గా ప్రయివేటులో ఇంటర్ విద్య అభ్యసించడానికి ఏడాది రూ.1.20 లక్షలు చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. హాస్టల్‌లో చేరితే రూ.రెండు లక్షల నుంచి రూ.3.20 లక్షలు చెల్లించాలి. ఇంటర్ విద్యను పూర్తి చేసి ఇంజి నీరింగ్‌లో చేరితే హాస్టల్ ఫీజు రూ.రూ.60 నుంచి రూ.80 వేలుగా ఉంటోంది. ప్రభుత్వం ఇచ్చే ఫీజురీ యింబర్స్‌మెంట్ ట్యూషన్ ఫీజులకే సరి పోతోంది. మిగిలిన డబ్బులు చేతి నుంచి చెల్లించాల్సి వస్తోంది. ఇంజినీరింగ్‌కు అదనంగా రూ. నాలుగు లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఫీజురీయింబర్స్‌మెంట్ వర్తించని విద్యార్థులు ఏటా రూ.నాలుగు లక్షలు చొప్పున నాలుగేళ్లకు రూ.16 లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. నీట్‌లో సీటు సాధిస్తే రూ.రెండు లక్షల వరకు ఖర్చు చేయాల్సివస్తోంది. సీటు లభించకపోతే రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షలు చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. మేనేజ్‌మెంట్, పార్మసీ కోర్సులకు సైతం భారీగా చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. బెస్ట్ అవైలబుల్ పథకం అటకెక్కింది. సామాన్యుల పిల్లలకు ప్రయివేటు, కార్పొరేట్ విద్య అందని ద్రాక్షను తలపిస్తోంది. ప్రభుత్వం బెస్ట్ అవలైబుల్ పథకం అమలు గురించి చర్చించి నప్పటికీ అమలుకు నోచుకోలేదు. బడుగ, బలహీన వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రయివేటు, కార్పొరేట్ సంస్థల ఫీజు వసూళ్లపై పర్యవేక్షణ కొరవడిన ఫలితంగా ఇష్టారాజ్యంగా మారింది. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను క్రమబద్ధీకరించడం, ఫీజుల వసూళ్లను క్యాష్ రూపంలో చెల్లించాల్సి వస్తోంది. ఫోన్‌ఫే, గూగుల్‌ఫే డిజిటల్ ప్లాట్‌ఫాంలో స్వీకరించాలనే నిబంధనలు అమలు చేయడం, ఇన్‌కమ్ ట్యాక్స్ దాడులు వంటి చర్యలతో పారదర్శకత ఉండడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందనే వాదన వినిపిస్తోంది.



కదం తొక్కిన అంగన్వాడీలు

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- పీడీ గో బ్యాక్ అంటూ నినాదాలు
- డిఆర్‌ఒకు వినతి పత్రం సమర్పణ



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

యాప్‌ల భారం, సంక్షేమ పథకాలు అమలు, పనిగంటలు, ఒత్తిడి తగ్గింపు, జీతాల పెంపు కోసం అంగన్వాడీలు కలెక్టరేట్ వద్ద కదం తొక్కారు. సమస్యల పరిష్కారం చేయని పీడీ గో బ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సోమవారం అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్త ధర్నాలో భాగంగా స్థానిక కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు ఈ సందర్భంగా అంగన్వాడీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీలక్ష్మీ, రాజేశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి కోశాధికారి బంగారుపాప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం దాటినా అంగన్వాడీ జీవితాల్లో, జీతాల్లో మార్పు రాలేదన్నారు. సమ్మె కాలపు హామీలు అమలు పరచలేదని, మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్చి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ రద్దు చేసి పనిబారం తగ్గించాలని పేర్కొన్నారు. సకాలంలో నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలని, పెండింగ్ జీతాలు బిల్లులు తక్షణమే ఇవ్వాలని తెలిపారు. దహన సంస్కారాలు ఖర్చులు ఇవ్వాలని, సుప్రీం తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు అంగన్వాడీల ఆందోళనకు సంఘీభావంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత సమ్మెలో కుప్పం వేదికగా అంగన్వాడీల సమస్యలు పరిశీలిస్తానని చెప్పి కేబినెట్ మీటింగ్‌లో మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తానని నిర్ణయించి అమలు చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. సకాలంలో జీతాలు బిల్లులు ఇవ్వకపోవడం పట్ల వర్కర్లు, హెల్పర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కార్పొరేట్ల అభివృద్ధి తప్ప కార్మిక ఉద్యోగుల అభివృద్ధి కనపడదని తెలిపారు. జనాభా పెంచండి అని చెబుతున్నారే తప్ప సంక్షేమ పథకాలు తగ్గించడం ఏ రకంగా పెరుగుతున్న జనాభాకు మౌలిక సదుపాయాలు కానీ, ఆహార భద్రత, ఆరోగ్యం వర్తింపజేస్తారని ప్రశ్నించారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని పని గంటల నుంచి మినహాయించాలని పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి అంగన్వాడీలకు జీతాలు రాలేదని, రాయచోటిలో కూరగాయల బిల్లులు, 4 నెలలు సెంటర్ అద్దెలు ఇవ్వలేదని తెలిపారు. పాలు రాకపోయినా రిసీప్ట్ కొట్టమనడం దారుణమన్నారు. ఒకటో తేదీ నుండి 17 రోజులు వరకు పాలు రాకపోవడంతో ప్రజల నుండి ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్‌లతో ఎఫ్‌ఆర్‌ఎష్ చేయడం కష్టతరంగా ఉండడంతో ట్యాబ్‌లు ఇవ్వాలని తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రామాంజులు మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని కనీస వేతనం రూ. 26 వేల కోసం జులై 9న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మె ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డిఆర్‌ఒ సమక్షంలో పీడీతో జరిగిన జాయింట్ సమావేశంలో అంగన్వాడీ సమస్యలన్ని పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సుకుమారి, మధురవాణి, ఈశ్వరమ్మ, విజయ, భూకైలేశ్వరి, ఓబుళమ్మ, కుమారి,చంద్రవతి, ప్రభావతి నాయకులతో పాటు పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి : డిఆర్‌ఒ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న డిఆర్‌ఒ మధుసూదనరావు

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని డిఆర్‌ఒ మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాలులో సోమవారం జిల్లా డిఆర్‌ఒ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం- పిజిఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షిస్తుందని చెప్పారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్‌ఎల్‌ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని చెప్పారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు డిఆర్‌ఒ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీదారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏడి సర్వే భరత్‌కుమార్, జిఎస్‌డబ్ల్యూఎస్ శాఖ జిల్లా అధికారి లక్ష్మీపతి, ఎస్‌డిసి రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిఆర్‌ఒ మధుసూధన్‌రావు

27న మెగా జాబ్‌మేళా : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్(ఎపిఎస్‌ఎస్‌డిసి) ఆధ్వర్యంలో మదనపల్లెలోని విశ్వహిత డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డిఆర్‌ఒ మధుసూధన్‌రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున తెలిపారు. జాబ్‌మేళా పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ఈ జాబ్‌మేళా 27వ తేదీన నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉద్యోగమేళాలో ఎయు స్మాల్ ఫిన్ బ్యాంక్, హెట్రో ల్యాబ్స్, అపోలో ఫార్మసీ, ఎస్‌బిఐ కార్డ్స్, హీరో మోటో క్రాప్, ముత్తూట్ ఫైనాన్స్ తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని ఆసక్తి, ఉన్న యువతీ, యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు https://naipunyam.ap.gov.in/user-registration లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరములకు 6301612761, 9553202509, 9741432931, 8897776368 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

యువకుడిని కఠినంగా శిక్షించాలి : ఐద్వా

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి, ఏడేళ్లు సహజీవనం చేసిన చివరకు మోసం చేసిన యువకుడిని కఠినంగా శిక్షించాలని, మోసపోయిన యువతిని పెళ్లి చేసుకోవాలని ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ డిమాండ్ చేశారు. ప్రియుడి చేతిలో నయవంచనకు గురై ఆత్మహత్యా యత్నానికి పాల్పడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆభాగ్యురాలు శృతిని సోమవారం భాగ్యమ్మ, ఐద్వా సభ్యులు రెడ్డిప్రసన్న వెళ్లి పరామర్శించారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా భాగ్యమ్మ మాట్లాడుతూ పట్టణంలోని గొల్లపల్లిలో అద్దె ఇంట్లో ఉంటున్న కవిత, రెడ్డప్ప దంపతుల కుమార్తె శృతిని ఇంటి యజమాని కుమారుడు మహేంద్ర ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి లొంగదీసుకుని, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి సహజీవనం చేశాడన్నారు. పెళ్లి చేసుకొమ్మని అడిగితే చేసుకోనని చెప్పడంతో మోసపోయానని తెలుసుకున్న యువతి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిందన్నారు. ప్రేమ పేరుతో మోసపోయిన శృతికి న్యాయం జరగాలని కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని సమగ్ర విచారణ జరపించాలన్నారు. మహిళలు, యువతులకు రక్షణ కల్పించి, సత్వర న్యాయం జరిగేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా సభ్యులు రెడ్డి ప్రసన్న, జి.అంజలి, షాహినా ఉన్నారు.



ఆస్పత్రిలో యువతిని పరామర్శిస్తున్న ఐద్వా నాయకులు

డిఎంహెచ్‌ఒగా లక్ష్మీనరసయ్య బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్



బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీనరసయ్య

జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారిగా డాక్టర్ లక్ష్మీన రసయ్య సోమవారం బాధ్య తలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ కొండయ్య ఈ ఏడాది మార్చిలో ఉద్యోగ విరమణ చేశారు. డిఐఒ డాక్టర్ ఉషశ్రీ పూర్తి స్థాయిలో డిఎం హెచ్‌ఒగా విధులు నిర్వహిం చారు. సాధారణ బదిలీలలో భాగంగా డాక్టర్ లక్ష్మీనరసయ్య డిఎంహెచ్‌ఒగా రాయచోటికి బదిలీ అయ్యారు. కర్నూలు ప్రాంతీయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్‌గా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మహల్, ఎర్రకోటపల్లి, పిహెచ్‌సిలలో వైద్యాధికారిగా, మదనపల్లి, తంబళ్లపల్లి క్లస్టర్ డిప్యూటీ డిఎంహెచఒగా, మదనపల్లి జిల్లా ఆస్పత్రి ఆర్‌ఎంఒగా విధులు నిర్వహిస్తూ ఉగ్యోగోన్నతిపై కర్నూల్ ఆర్‌టిసి ప్రిన్సిపల్‌గా వెళ్లారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రోగ్రామ్ ఆఫీసర్స్, మెడికల్ ఆఫీసర్స్, వైద్య ఆరోగ్య సిబ్బంది, యూనియన్ల సహకారంతో జిల్లాను వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఇండికెటర్లలో మొదటి స్థానంలో ఉండేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. సిబ్బంది అందరూ సహాయసహకారాలు అందించాలని కోరారు. సందర్భంగా ఆయనను జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో ప్రోగ్రామ్ అధికారులు, కార్యాలయ సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

నా భర్తకు పింఛను ఇచ్చి ఆదుకోండి సారూ..!

- సబ్ కలెక్టర్‌కు బాధితురాలి మొర

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

కాళ్లు, చేతులు పడిపోయి పక్షవాతంతో మంచం పట్టిన తన భర్తకు పింఛను ఇచ్చి ఆదుకోవాలని బాధితురాలు అధికారులకు మొర పెట్టుకుంటున్నారు. ఏడాదిగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా కనికరించలేదని ఆమె సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్మలా దేవికి విన్నవించారు. బాధితురాలి కథనం మేరకు.. మదనపల్లె మండలం, బసిని కొండలో ఉంటున్న చంద్ర అనే వ్యక్తికి రెండేళ్ల కిందట పక్షవాతానికి గురై కాళ్లు, చేతులు పడిపోవడంతో మంచం పట్టాడు. భార్య రేణుక కూలీనాలీ చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. పింఛను కోసం ఏడాదిగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ ఎఒ నిర్మలదేవికి అర్జీ ఇచ్చామని పేర్కొన్నారు. సదరన్ సర్టిఫికేట్ ఇస్తే పింఛనుకు దరఖాస్తు చేస్తామని చెబుతున్నారని, అధికారులు, సచివాలయానికి వెళ్తే సదరన్ సైట్ ఓపెన్ కాలేదని సిబ్బంది చెప్తున్నారని వాపోయారు. ఇద్దరు చిన్న బిడ్డలతో పాటు మాటలు రాని, నడవలేని స్థితిలో ఉన్న తన భర్తను చూసుకుంటూ కుటుంబాన్ని నడపాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ పనికి పోతేనే ఆ రోజు పూట గడుస్తుందని, లేకుంటే రోజంతా ఇంటిల్లపాది పస్తులతో కాలం వెలదీయాల్సి ఉందని రేణుక కన్నీటి పర్యంతమయ్యారు. అధికారులు తమపై కనికరం చూపి తన భర్తకు పింఛను ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న నిర్మలాదేవి

విద్యార్థిని చితకబాదిన 'నారాయణ' టీచర్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్



కంటిపై గాయమైన విద్యార్థి

విద్యార్థి వెనక్కి తిరిగి చూశాడని ఓ ఉపాధ్యాయుడు ఆగ్రహానికి లోనయ్యాడు. విచక్షణ రహితంగా ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని చితకబాదాడు. సంఘటన అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని నారాయణ పాఠశాలలో సోమవారం చోటుచేసుకుంది. విద్యార్థి తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన షేక్ ఇర్ఫాన్ కుమారుడు షేక్ మహమ్మద్ అబ్దాన్ 8వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థ్ క్లాస్ రూమ్ లో వెనక్కి తిరిగి చూస్తున్నాడని ఆగ్రహానికి లోనైన టీచర్ అశోక్ ఆ విద్యార్థిని ఎగ్జామ్ ప్యాడ్ తో తీవ్రంగా చితకబాదాడు. విద్యార్థికి కంటి కింద గాయం అవడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. విద్యార్థి ఏడుస్తూ జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు వివరించాడు. అతని కంటి కింద అయిన గాయాన్ని తీవ్ర రక్తస్రావం చూసి వెంటనే వారు ఓ ప్రవేటు హాస్పిటల్‌కి తీసుకెళ్లి చికిత్స అందించారు. విద్యార్థిపై ఉపాధ్యాయుడు నారాయణ స్కూల్ టీచర్ అశోక్ విచక్షణా రహితంగా కొట్టడం పట్ల తోటి విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠాలు అర్థమయ్యే విధంగా చెప్పాలి కానీ, ఇలా దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఉపాధ్యాయుడు విద్యార్థులపై ఇలాగే దాడి చేస్తాడని, అతని క్లాసుకు వెళ్లాలంటే విద్యార్థులంతా భయభ్రాంతులకు గురవుతున్నారని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-రాయచోటి: యువతను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు జంగంరెడ్డి కిషోర్‌దాస్ అన్నారు. వైసిపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రాయచోటిలో యువత పోరుబాట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఉద్యోగాల కల్పన, నెలకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏటా జాబ్ కేలండర్ విడుదల చేయాలని మోసం చేశారన్నారు. యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ఇచ్చిన హామీలపై పోరాడి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరుతూ డిఆర్‌ఒ మధుసూదన్‌రావుకుకు యువత, విద్యార్థి విభాగాల నాయకులు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ప్రచార అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ వైఎస్ చైర్మన్ వివేకానందరెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రధర్, నాయకులు విజయభాస్కర్, భరత్ కుమార్‌రెడ్డి, మమత పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు



మదనపల్లె : నిరసన చేస్తున్న కార్మికులు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి- మదనపల్లె

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల విధుల బహిష్కరణ 20వ రోజైన సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం శిబిరంలో నిరసనగా కూర్చున్నారు. దీని ప్రభావంతో పట్టణవ్యాప్తంగా వీధి లైట్లు, తాగు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ జెఎసి నాయకులు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి తమకు న్యాయం చేయాలని, పనికి తగ్గ వేతనం ఇవ్వాలని చెప్పారు. టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను తమకూ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించకపోతే, విధుల బహిష్కరణను కొనసాగించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ జెఎసి నాయకులు ఎస్.కె. రెడ్డప్ప, నాగరాజు, బాబు బాలకృష్ణ, సజాద్, కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు 36 జిఒ అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు 36 జిఒను వర్తింపజేయాలని కోరారు. వీటితోపాటు కార్మికులకు పని భద్రత కల్పించాలని కార్మికులకు అందరికీ ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ సెక్షన్ అధ్యక్షులు అక్బర్ బాషా మాట్లాడుతూ కార్మికులకు పనిగంటలు తగ్గించి టెక్నికల్ నాన్ టెక్నికల్ డ్రైవర్లకు రూ. 24,500 వేతనాలు వర్తింపజేయాలని కోరారు. తక్షణమే చెత్త తరలిస్తున్న డ్రైవర్లకు పనికి తగ్గ వేతనాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కానిపక్షంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జులై 2న సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.



రాయచోటి : కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు



విద్యార్థికి నగదును అందజేస్తున్న సాయి విశాల్‌రెడ్డి

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని ముక్కవారిపల్లి హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు ప్రోత్సాహకాలు ముక్కా రూపానందరెడ్డి తనయుడు ముక్కా సాయివిశాల్‌రెడ్డి చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. కృష్ణంపల్లి గ్రామానికి చెందిన కె.గ్రామిత 589/600కి ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, అయ్యలరాజుపల్లి గ్రామానికి చెందిన సి.హెచ్.నీరజ 536/600కి ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, ముక్కావారిపల్లి గ్రామానికి చెందిన వై.సతీష్ కుమార్‌రెడ్డి 528/600కి తృతీయ బహుమతిగా రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా సాయి విశాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే మా బాధ్యతని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ చదువు మీద ఆసక్తి పెంచే దిశగా చిన్న సహాయం చేస్తున్నామని పేర్కొన్నారు. భావి తరాల భవిష్యత్తు భద్రంగా ఉండాలంటే పిల్లలు చక్కగా చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలని తెలియజేశారు. విద్యార్థులకు అవసరాలను అడిగి తెలుసుకుని తగిన అవసరాలను గుర్తించి త్వరలో వాటిపై తగు పరిష్కారాలు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జయలక్ష్మి, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పిటిఎం పిహెచ్‌సి డాక్టర్‌గా సాదియా

ప్రజాశక్తి-ములకలచెరువు



బాధ్యతలు స్వీకరిస్తున్న సాదియా

పిటిఎం ప్రభుత్వా సుపత్రి వైద్యురాలిగా సాదియా సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా నార్పల ప్రభుత్వాస్పత్రి నుండి ఇక్కడికి బదిలీపై వచ్చారు. పిటిఎంలో పనిచేస్తున్న పురుషోత్తం నాయక్ అనంతపురం జిల్లా గరుడాచల ప్రభుత్వా సుపత్రికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సాదియా మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలు అందిస్తానన్నారు. మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఇ.వి.రమణ ఆమెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.



నారప్ప వితరణతో భోంచేస్తున్న చిన్నారులు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద వృద్ధాశ్రమంలో జీవనం కొనసాగిస్తున్న వృద్ధుడు టి.నారప్ప తన సేవాగుణాన్ని చాటుకున్నాడు. ఆయనకు ముగ్గురు పిల్లలు అందరికీ పెళ్లిళ్లు చేసి ఆస్తిని సమ భాగంగా పంచిపెట్టి తండ్రిగా బాధ్యతలు నిర్వహించాడు. వృద్ధాప్యం వచ్చిన తర్వాత ఆ పిల్లలకు తండ్రి బరువయ్యాడు. ఆయనను సరిగ్గా పట్టించు కోకపోవడం వల్ల 8 నెలలుగా ఆనంద వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నాడు. ఆయనకు వచ్చిన పెన్షన్‌లో కొంత ఖర్చులకు పోను ప్రతినెలా కొంత దాచిపెట్టుకున్నాడు. సోమవారం తన తల్లిదండ్రులు నరసప్ప, లక్ష్మమ్మల జ్ఞాపకార్థం సంస్థలో ఆశ్రయం పొందుతున్న పిల్లలు, వృద్ధులకు మాంసాహార అన్నదాన వితరణ చేశారు. సొంత లాభం కొంత మానుకొని, తోటి వాడికి తోడ్పడవోయ్ అన్న సూక్తితో నారప్ప చేపట్టిన ఈ కార్యక్రమం మా అందరికీ ఎంతో ఆదర్శమని సంస్థ జనరల్ సెక్రెటరీ ఎ.కవితారాణి ప్రశంసించారు. నారప్పకు జ్ఞాపిక, మెమోంటోను బహూకరించి అభినందించారు.



అంజాద్ అలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రధానోపాధ్యాయుడికి నివాళులు

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజాద్ అలీ ఆదివారం సాయంత్రం మృతి చెందారు. సోమవారం పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి- పుల్లంపేట

ఆడపిల్లలు బాగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించినప్పుడే వారి జీవితానికి సార్థకత ఏర్పడుతుందని పుల్లంపేట మండల అభివృద్ధి అధికారి జయశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులందరికీ విద్యా మిత్ర కిట్టు అందజేశారు. ఈ కిట్టులో బ్యాగ్స్, బెల్టు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు ప్రభుత్వ పథకాలన్నీ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇల్లాలు ఇంటికే పరిమితం కాకూడదని చెప్పారు. వారు స్వసక్తిగా ఎదిగి అందరికీ ఉపయోగపడాలని పేర్కొన్నారు. అప్పుడే ఈ శ్రీ జన్మకు సార్థకత ఏర్పడుతుందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ జిపి హైమావతి, సూపరింటెండెంట్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఆడవాళ్ళ చదువు అందరికీ వెలుగు అని వారు చదవాలి అందరూ ఎదగాలి అని పేర్కొన్నారు. చదువుకోవడం వల్ల ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, విద్యాలక్ష్మి, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యామిత్ర కిట్ అందజేస్తున్న ఎంపిడిఒ జయశ్రీ

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలంటూ 25న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్ అన్నారు. రైల్వేకోడూరు విఆర్ఎల మండల కమిటీ సమావేశం, వీఆర్ఏ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 నెలలు గడిచిన వీఆర్ఏల సమస్య ఏ ఒక్కటి పరిష్కారం చేయలేదన్నారు. గ్రామ రెవెన్యూ సహాయలకు 8 సంవత్సరాలుగా జీతాలు పెరగలేదన్నారు. రాష్ట్రంలో మంత్రులు ముఖ్యమంత్రులు మారుతున్నారు కానీ, వీఆర్ఏల సమస్యలు తీర్చడంలేదన్నారు. ప్రక్కన, ఉన్న తెలంగాణ రాష్ట్రంలో విఆర్ఎలకు పేస్కేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఇక్కడ మన రాష్ట్రంలో కూడా విఆర్ఎలకు పేస్కేల్ అమలు చేయాలని మంత్రులు అధికారులు చుట్టూ ప్రదక్షణాలు చేస్తున్న కనికరించడం లేదన్నారు. మార్చి నెలలో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రస్తావించిన గ్రామ సేవకులు, విఆర్ఎల గురించి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. చదువుకున్న విఆర్ఎలు ఎప్పటికైనా విఆర్ఓగా ప్రమోషన్ వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం మాత్రం ప్రమోషన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా పని చేస్తున్న వారిని విఆర్ఎలుగా గుర్తించాలన్నారు. ప్రమోషన్ కోసం ఎదురుచూస్తున్న విఆర్ఎలకు వయోభారం పెరుగుతుందని, దళిత, గిరిజన మైనార్టీ బడుగు బలహీన వర్గాలకు విఆర్ఎల కుటుంబాలను ఆకలి బాధల నుండి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెరిగిన ధరలకు అనుకూలంగా విఆర్ఎలకు పేస్కేలు అమలు చేయాలని, కనీస వేతనం



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్

26,000, ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటెండర్, నైట్ వాచ్‌మెన్, డ్రైవర్లకు ప్రమోషన్లు శాతాన్ని 70 శాతంకు పెంచాలని పేర్కొన్నారు. అర్హత ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విఆర్ఏల సమస్యల పరిష్కారం కొరకు ఈనెల 25న తేదీన రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, రాజంపేట సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద, జరిగే ధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విఆర్ఏ సంఘం మండల కార్యదర్శి కలిశెట్టి లక్ష్మీకర్, రేవతి, బత్తిన సుబ్రమణ్యం, బి.నాగరాజు, ఇ.బలరాం, సురేంద్ర, నగిరిపాటి,రాజా, రామాంజనమ్మ, సుబ్బరాయుడు, ఎస్ఎం కాసిం.తదితరులు పాల్గొన్నారు.

'ఏడాది పాలనతో ఒరిగింది శూన్యం'



సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన చేస్తున్న కాంగ్రెస్, సిపిఐ, బహుజనసేన నాయకులు

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

ఏడాది కూటమి ప్రభుత్వ పాలనతో ఒరిగింది శూన్యమని మదనపల్లె కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెడ్డి సాహెబ్ విమర్శించారు. అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ, కాంగ్రెస్, బహుజన సేన నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెడ్డి సాహెబ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ కొత్తగా ఏర్పడ్డ అన్నమయ్య జిల్లా, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. నాలుగేళ్ల కిందట తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్ట్, పింఛ ప్రాజెక్టులకు మరమ్మతులు చేయలేదని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాలు పూర్తవుతున్నా హంద్రీనీవా పనులు పూర్తి కాలేదని, మదనపల్లె ప్రజల దాహార్తిని తీర్చడానికి నిర్మించిన చిప్పిలి సమర స్టోరేజ్ ట్యాంక్ పనులు పూర్తి చేయలేదన్నారు. కేవలం రూ. 15 కోట్లు కేటాయిస్తే చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ పనులు పూర్తయి మదనపల్లె ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. మదనపల్లె ప్రాంతంలో టమోటా ఆధారిత పరిశ్రమలు నెలకొల్పితే రైతాంగానికి గిట్టుబాటు ధర దొరుకుతుందన్నారు. కడప నుండి మదనపల్లె మీదుగా బెంగళూరుకు రైల్వే లైన్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బహుజనసేన నాయకులు శ్రీచందు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మదనపల్లె ను జిల్లా చేస్తామని, బీటీ కళాశాలను యూనివర్సిటీ చేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా పట్టించుకోక పోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కృష్ణప్ప, మనోహర్‌రెడ్డి, సాంబశివ, మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ ఎస్.కె.బాషా, మహమ్మద్ షరీఫ్, ఖాదర్‌బాషా, ఈశ్వరమ్మ, బహుజనసేన నాయకులు గిన్నెల మనోహర్ రెడ్డి, రూపక్ నాయక్, బాను పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు చేయడంలో జగన్ దిట్ట : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అంటే లెక్కలేని వ్యక్తి నాయకుడా అని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తీరుపై విరుచుకుపడ్డారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చమర్తి మాట్లాడుతూ కార్యకర్తలను రెచ్చగొట్టి వారి జీవితాలను నాశనం చేయడమే జగన్ లక్ష్యమని పేర్కొన్నారు. జగన్‌కు మానవత్వమే లేదని విమర్శించారు. నమ్ముకున్న వారికి భరోసా ఇవ్వలేనీ నాయకుడు జగన్ అని, ఇద్దరు చనిపోయినా కనీస పశ్చాతాపం లేని వ్యక్తి నాయకుడు ఎలా అవుతాడని ప్రశ్నించారు. చనిపోయారని తెలిపినా కనీసం పరామర్శించని జగన్ నైజం ఏమిటో అర్థమవుతుందని పేర్కొన్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లకు పరామర్శలు, యాత్రలా అని ప్రశ్నించారు. హత్య, శవ రాజకీయాలతో సాధించేదేమిటని నిలదీశారు. చనిపోయిన వారిని పక్కకు ఈడ్చి జేజేలు కొట్టించుకోవడం నాయకుడి లక్షణం కాదని విమర్శించారు. కార్యకర్తల బెదిరింపులను కూడా సమర్థిస్తున్న సైకో ను ప్రజలు గమనిస్తున్నారని, జగన్ ప్రచార ఆర్భాటానికి వృద్ధుడు బలయ్యాడని, సకాలంలో వైద్యం అందించి ఉంటే బతికేవాడని అన్నారు. ప్రమాదంపై పశ్చాత్తాపం చూపకుండా జగన్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో రాజంపేట పట్టణ టిడిపి అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు,



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

టిడిపి నాయకులు బాపనయ్య నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, పసుపులేటి ప్రవీణ్ కుమార్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరు వేణుగోపాల్, పోలి చెరువు ప్రెసిడెంట్ నాగినేని నాగేశ్వరరావు, ప్రొద్దుటూరు అబ్జర్వర్ సుబ్రహ్మణ్యం నాయుడు, యువ నాయకులు పరశురాం నాయుడు. తేజాల ఆనంద్ పాండురాజు, వెంకటేశ్వర్లు నాయుడు పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్ జిల్లా ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న డిఎస్‌పి మహేంద్ర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని రాగి వైరును అపహరించే ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను సోమవారం బి.కొత్తకోట పోలీసులు అరెస్టు చేశారని డిఎస్‌పి మహేంద్ర పేర్కొన్నారు. డిఎస్‌పి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దొంగల వద్ద నుంచి రూ.11,42,600 విలువగల రాగి వైరును స్వాధీనం చేసుకున్నారు. బి.కొత్తకోట మండలం కంబళ్ళపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండా సత్యసాయి జిల్లా, ఒడిసి మండలం, అల్లాపల్లి పంచాయతీ, బురుజుపల్లికి చెందిన కోటిరెడ్డి రామకృష్ణారెడ్డి సంచితో వెళుతూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడన్నారు. సిఐ జీవన్ గంగానాథ్ బాబు, క్రైమ్ సిఐ చంద్రశేఖర్, సిబ్బంది పట్టుకుని సంచిని తనిఖీ చేయగా అందులో జాపర్ వైరు బయటపడిందన్నారు. విచారించగా తాను, మా పక్క గ్రామం పగడావారిపల్లికి చెందిన వెంకటేష్ ఇద్దరం కలిసి బి.కొత్తకోట మండలంలో 14 చోట్ల, మదనపల్లె వద్ద ఒక చోట, పిటిఎం మండలంలో ఒక చోట, మొలకలచెరువు మండలంలో 7 చోట్ల, గాలివీడు మండలంలో ఒక చోట, కురబలకోట మండలంలో ఒకచోట, సత్యసాయి జిల్లా, తలుపల మండలంలో 3 చోట్ల, తనకల్లు మండలంలో ఒక చోట, గాలివీడు మండలంలో 2 చోట్ల, పుల్లంపేట మండలంలో 2 చోట్ల, నందలూరు మండలంలో ఒక చోట, పీలేరు మండలంలో 2 చోట్ల, నల్లచెరువు మండలంలో ఒక చోట, గాండ్లపెంట మండలంలో 2 చోట్ల 40 ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులో ఉన్న కాపర్ వైర్‌ని దొంగతనం చేసినట్లు నేరం అంగీకరించారని తెలిపారు. వైరును బి.కొత్తకోట మండలం, బీరంగి గ్రామం, రంగసముద్రం ఏరు వద్ద గల చెట్ల పొదలలో దాచిపెట్టినట్లు తెలిపారన్నారు. వీరిపై 11 పోలీసు స్టేషన్ల పరిధిలో 28 కేసులు నమోదు కాగా 40 ట్రాన్స్‌ఫార్మర్ల నుండి దొంగతనం చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.11,42,600 విలువగల 626 కిలోల కాపర్ కోటింగ్ కలిగిన వైల్డింగ్ వైర్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. కేసు ఛేదనలో ప్రతిభ కనపరిచిన క్రైమ్ సిబ్బంది పి.నరసింహులు, శంకర, రాఘవరెడ్డి, శివ, శంకర, దొరబాబు, చలపతి, సుబ్బయ్యలను డిఎస్‌పి అభినందించారు.

వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వైసిపి నాయకులు, కార్యకర్తలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కురబలకోట మండలం, పిచ్చలవాండ్లపల్లి పంచాయతీలో ఆయన పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న ప్రభాకర్‌రెడ్డిని ఆయన పరామర్శించారు. మేకలవారిపల్లిలో మేకల సురేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపికి కార్యకర్తలే బలమన్నారు. వారిని కాపాడుకోవడం మా కర్తవ్యమన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు కార్యకర్తలకు ఏ ఆపద వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రభాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

పార్టీ పటిష్టత కోసమే సంస్థాగత ఎన్నికలు

ప్రజాశక్తి - ములకలచెరువు

టిడిపి పటిష్టత కోసమే సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల పరిశీలకుడు జనార్ధన్ గౌడ్ అన్నారు. సోమవారం బూచిపల్లి సంపతికోట మల్లెల పోతుపేట బూర్లపల్లి పంచాయతీలలో గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. పంచాయతీలలో ఇప్పటి వరకు ఎనిమిది పంచాయతీలలో ఎన్నిక పూర్తయిందన్నారు రెండు రోజుల్లో అన్నిగ్రామాలలో కమిటీలను ఏర్పాటు చేసి మండల కమిటీ ఎన్నిక నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాల్లో పిటిఎం టిడిపి మండలాధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, మల్లెల సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, రమేష్ రెడ్డి, బూర్లపల్లి సుధాకర్‌రెడ్డి, పట్టా చంద్రమోహన్, సంపతి కోట కిట్టన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి- కడప అర్బన్

నోయిడా పట్టణం, సెక్టార్18లో 400వ షో రూమును మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎం.పి.అహ్మద్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఇండియా ఆపరేషన్ ఎండి ఆషర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పి. వీరన్ కుట్టి, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సలీం మాథ్యూ, రిటైల్ ఆపరేషన్ హెడ్ పి.కె.సిరాజ్, రీజనల్ హెడ్ ఎస్.కె. జిషాద్, మేనేజ్‌మెంట్ బృందం సభ్యులు పాల్గొన్నారు



ఎమ్మెల్యేను కలిసిన మొరవపల్లి గ్రామస్తులు

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. సోమవారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుండి వినతులు స్వీకరించి, వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మదనపల్లె గ్రామీణ మండలం, బసినికొండ పంచాయితీ, మొరవపల్లి గ్రామంలో 25 కుటుంబాల వారు ఉప్పు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. వందమందికి పైగా ఉన్న మొరవపల్లి గ్రామస్థులమైన మాకు ఇప్పటి వరకు ఆధార్ కార్డు లేదని ఎమ్మెల్యే కు విన్నవించారు. భారతదేశ వ్యాప్తంగా ఆదార్ కార్డులు అమల్లోకి వచ్చి 15 ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఆధార్ కార్డులు చేయించుకోకపోవడం బాధాకరమన్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తక్షణమే మొరవపల్లి గ్రామంలో క్యాంపు నిర్వహించి ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, సీనియర్ టిడిపి నాయకులు పచ్చిపాల రామకృష్ణ ఆచారి, సీతక యుగంధర్, ప్రసాద్, గుట్ట రమణ, మొరవపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.



టిబి వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అవగాహనతో టిబి నియంత్రణ సాధ్యం

ప్రజాశక్తి-కలికిరి

టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమమును విజయవంతం చేద్దామని మేడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కావ్య గంధ అన్నారు. టిబి ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా చేరువు ముందరపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న 104 సేవలలో డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి, టిబి వ్యాధిపై ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి పొగత్రాగు వారిని, మద్యం సేవించు వారిని, గతంలో టిబి జబ్బు వచ్చి భాగైన వారిని, హెచ్ఐవి పాజిటివ్ వారిని, బిఎంఐ 18 కంటే తక్కువ ఉన్న వారిని, గర్భిణులను, షుగర్ ఉన్న వారిని గుర్తించి వారికి గళ్ళ పరీక్షలు నిర్వహించి, వారికి పాజిటివ్ వచ్చిన యెడల ఆరు నెలల చికిత్స ఉచితంగా ప్రారంభించడం జరుగుతుంది అన్నారు. చికిత్స సమయంలో రోగి ఖాతాలో రూ.వెయ్యి జమ చేస్తామన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవడం కోసం ఈ పైకం వారికి ఇస్తామన్నారు. అనంతరం నినాదాలు చేస్తూ, ప్లాకార్డ్స్ ప్రదర్శన చేస్తూ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, ఎస్‌టిఎస్ నాగిరెడ్డి, సిహెచ్ఒ నాగరాని, ఎఎన్ఎం నఫీసా, 104 సిబ్బంది ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్వేయర్లు

సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ పోలిశెట్టి కోరారు. సోమవారం ఆయన సర్వేయర్లతో కలిసి తహశీల్దార్ పీర్‌మున్నికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ పోలిశెట్టి మాట్లాడుతూ సర్వేయర్ల రేషనలైజేషన్, అంతర్ జిల్లాల బదిలీలు, సొంత మండలాల్లో పోస్టింగ్ వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. తహశీల్దార్ సానుకూలంగా స్పందించి సర్వేయర్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సర్వేయర్ల సంఘం మండల అధ్యక్షులు దామోదర్, ఇతర సర్వేయర్లు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెలో ఓ చైన్ స్నాచర్ బరితెగించాడు. పట్టపగలే, జనసంద్రం ఉన్న ప్రాంతంలోనే మహిళ మెడలో బంగారు గొలుసును చోరీ చేసి పరారయ్యాడు. ఈ సంఘటన సోమవారం జరిగింది. ఈ మేరకు బాధితురాలు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని సొసైటీ కాలనీలో నివాసముంటున్న సత్యారెడ్డి పట్టణంలోకి వెళ్లేందుకు స్థానిక రామాలయం వద్దకు వచ్చి ఆటో కోసం వేచి ఉంది. ఈ సమయంలో ద్విచక్రవాహనంలో అటుగా వచ్చిన గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలో ఉన్న 32 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఏమి జరిగిందోనని తేరుకునే లోపల నిందితుడు కనుమరుగయ్యాడు. బాధితు రాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సోమవారం ఎద్దులవారిపల్లె, రేణుమాకులపల్లి పంచాయతీలలో పర్యటించారు. రేణుమాకులపల్లిలో ఇటీవల మరణించిన వైసిపి నాయకులు పెద్దరమణ కుటుంబాన్ని పరామర్శించి వారి కుమారుడు సోమశేఖర్‌కు రూ.20 వేల ఆర్థిక సహాయంచేశారు. అనంతరం ఎద్దులవారిపల్లి గ్రామంలో ఇటీవల యాక్సిడెంట్ గురైన అన్వర్ కుమార్తె అరిఫాను పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం చేసివారి కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటరెడ్డి, సాంబశివారెడ్డి, రెడ్డప్పరెడ్డి, ప్రకాష్ రెడ్డి, కరీముల్లా పాల్గొన్నారు.



అరిఫాను పరామర్శించి సాయం చేస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి